# కంప్లెయింట్

—విశ్వమోహిని

జనరల్ పోస్టాఫీసులో ప్రతి కౌంటర్ వద్దా రద్దీ ఎక్కువగా వుంది.

స్టేషనరీ అమ్మేచోట క్యూలో నిలుచున్నాడు రామ్మూర్తి. హనుమంతుడి తోకలా పెరిగిపోతూన్న క్యూలో మధ్యలో వున్నాడు అతను. పది నిమిషాలుగా ఆ క్యూలో నిల్చొని వున్నాడు. స్టేషనరీ అమ్ముతూన్న క్లర్కు నువిలివాడు కావడంవల్ల క్యూ నత్తనడక నడుస్తోంది.

ఓ మిత్రుడికి ఉత్తరం రాయాలని ఇన్లాండ్ లెటర్ కోసం నిలుచున్నాడు రామ్మూర్తి. అసలు ఆ ఉత్తరం రాయాలని వెళ్లాళ్ళుగా అనుకుంటున్నాడు. కాని, ఎప్పటికప్పుడే అశ్రద్ధ అయిపోతోంది. గత దినం ఆ మిత్రుడి నుంచి మరో ఉత్తరం వచ్చింది నిష్ఠూరంతో. ఎలాగయినాసరే ఆరోజే తప్పనిసరిగా అతనికి జవాబు రాసేయాలని నిశ్చయించుకున్నాడు. అందుకే దేశంలోని ముఖ్యవనరుల్లా క్షణక్షణమూ హాపిక తిరిగి పోతూవున్న క్యూలోంచి కదలలేదు అతను.

రామ్మూర్తి వంతు వచ్చి ఇన్లాండ్ లెటర్ దొరికేసరికి మరో అయిదు నిమిషాలు పట్టింది అంత సేపూ పడిగాపులు పడి నిల్చున్నాడేమో మళ్ళీ అక్కడే నిల్చొని ఉత్తరం రాసిపడెయ్యాలంటే బద్ధకం వేసిందతనికి. పైగా కూర్చోవడం మాట అటుంచి-నిలుచుని ఉత్తరం రాయాడానికైనా అనువైనచోటు ఎక్కడా మిగలలేదు. ఇంటికి వెళ్ళి కుదురుగా రాయవచ్చులెమ్మనుకుని కవరు మడిచి జేబులో పెట్టుకుని బయటకు నడిచాడు.

జి పి వో. లోంచి బయటకు వచ్చిన రామ్మూర్తి గుండెలు గుభేలుమన్నాయి.

సైకిల్ కనిపించలేదు!

కంగారుగా ఆవరణలో వున్న సైకిళ్ళన్నీ పరీక్షగా చూసాడు.

అతని సైకిల్ ఎక్కడా లేదు!

తాళంవేసిన సైకిల్ మాయమైంది!

జేబులోంచి తీసిన తాళపుచెవితో అయోమయంగా బుర్ర గోక్కున్నాడు

అతను. ఏంచేయాలో తోచక వెర్రిగా దిక్కులు చూసాడు.

అతని అవస్థను గమనించిన ఒక రిద్దరు 'ఏమయిందని' అడిగారు.

"నా సైకిల్ యిక్కడ పెట్టి తాళంవేసి మరీ లోపలికి వెళ్ళాను. పావుగంటలో తిరిగివచ్చి చూస్తే సైకిల్ అదృశ్య మైంది!" అన్నాడు రామ్మూర్తి ఏడుపు ముఖంతో.

సైకిల్ పోయిందనగానే అంతా గుమిగూడారక్కడ. సైకిల్ గురించి వివరాలు ఆరాతీస్తూ తలో ప్రశ్న వేసారు.

"సైకిల్ కొని ఏడాదయింది. కొత్త హీరో సైకిల్" అంటూ అడిగినవాళ్ళం దరికీ రిపీట్ చేస్తున్నాడు రామ్మూర్తి.

చెప్పిందే చెప్పడంతో విసుగెత్తి పోతోంది అతనికి. సైకిల్ పోయిం దన్న బాధ కంటె, ఆ బాధే ఎక్కువై పోయింది.

అంతా ఆరాతీసేవాళ్ళే తప్ప అవ సరమైన సలహా యిచ్చేవాళ్ళుగాని, ఆదు కునేవాళ్ళుగాని ఒక్కరూ కనిపించలేదు ఆ గుంపులో.

"పోలీసు కంప్లైయింట్ యివ్వండి" అన్నారు యింకొకరు.

"మీ దగ్గర సైకిల్ నంబరూ, కొన్న రశీదూ వున్నాయా?" అడిగారు మరొకరు.

"ఇంట్లో వుండాలి" జవాబిచ్చాడు రామ్మూర్తి.

"ముందు అవి తీసుకురండి" అన్నాడు ఆ వ్యక్తి.

"ఏం?"

"అవి రెండూ లేనిదే పోలీసులు కేసు బుక్ చేసుకోరు" పోలీసుల పోక డలు తనకు బాగా తెలువన్నట్లు తేల్చి వేసాడు ఆ వ్యక్తి.

మరోసారి సైకిల్ కీతో బుర్ర గోక్కున్నాడు రామ్మూర్తి.

"ఇప్పుడది ఎక్కడ వుందో వెదకాలి!" అన్నాడు.

రామ్మూర్తి చిన్నవాడేం కాదు. నలభయ్యేళ్ళుంటాయి అతనికి. ఓ గవర్నమెంటు ఆఫీసులో అప్పర్ డివి జన్ క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. కాని, ఎంత వయసు వచ్చినా ఇటువంటి విష యాలలో ఎవరయినా బేలగానే వుంటారు. పైగా అది అతని మొదటి అనుభవం కూడాను.

"ఆలస్యం చెయ్యకుండా వెంటనే వెళ్ళి తీసుకురండి. ఈ ప్రక్కనే పోలీస్ స్టేషన్ వుంది. కంప్లైయింట్ ఇవ్వండి" అన్నారు ఇంకొకరు.

రామ్మూర్తి ఇల్లు అక్కడికి మూడు కిలోమీటర్లలో వుంది. ఆవేళ పనివుండి క్యాజువల్ లీవ్ పెట్టాడు కనుక ఆఫీసు గొడవలేదు.

పోలీసులన్నా. పోలీసు స్టేషన్లన్నా రామ్మూర్తికి భయం. కనుక ఆఫీసుకు వెళ్ళి తన మిత్రుడు శంకర్రావును తీసు

కళ్యాణమనుకున్నాడు. శంకర్రావు ధైర్యవంతుడు, మాటకారీను.

ఇంటికి వెళ్ళకుండా తిన్నగా ఆఫీసుకు వెళ్ళాడు రామ్మూర్తి శంకర్రావును కలుసుకుని సైకిల్ దొంగతనం గురించి చెప్పాడు. శంకర్రావుతో పాటు అతని యితర కొలీగ్స్ కూడా చాలా విచారించారు. ఎవరికి తోచిన సలహా వాళ్ళిచ్చారు.

శంకర్రావు ఆఫీసులో పర్మిషన్ తీసుకుని రామ్మూర్తితో బయలుదేరాడు

ఇంటికి వెళ్ళి సైకిల్ కొన్న రశీదు కోసం వెదికాడు రామూర్తి. అది కనిపించేసరికి ఓ గంట పట్టింది.

ఆ రశీదును పట్టుకుని మిత్రులిద్దరూ జి.పి వో ఏరియాలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది.

స్టేషన్‌లో ఎస్‌ఐ లేడు. లంచ్‌కి వెళ్ళాడట. హెడ్డూ, రైటరూ, ఓ ఇద్దరు కానిస్టేబుల్సూ వున్నారు.

ఆ సమయంలో స్టేషన్‌లో ప్రవేశిస్తున్న ఆ మిత్రద్వయాన్ని ఖైదీలను చూసినట్టు చూసారు పోలీసులు.

“ఏం కావాలి?” అని ప్రశ్నించాడు సెంట్రీ.

“సైకిల్ పోయింది” అన్నాడు రామ్మూర్తి.

‘ఓస్ యింతేనా!’ అన్నట్టు చూసి లోపల రైటర్ కూర్చున్న వేపు చేయి చూపించాడు సెంట్రీ.

రైటర్ దగ్గరి కెళ్ళి నమస్కారం చేసారు మిత్రులు.

రైటర్‌కి ముప్ఫయ్యేళ్ళుంటాయి. ఎత్తుగా, దృఢంగా వున్నాడు.

వారివంక ఏమిటన్నట్టు చూసాడతను

“నా సైకిల్ పోయింది” అన్నాడు రామ్మూర్తి.

వాళ్ళను కూర్చోమని చేత్తో సైగ చేసాడు రైటర్.

ప్రక్కనున్న పొడుగు బల్లమీద కూర్చున్నారు మిత్రులు.

“వివరాలు చెప్పండి” అన్నాడు రైటర్.

అంతలో కానిస్టేబుల్స్ అక్కడికి వచ్చి నిల్చున్నారు.

జరిగిందంతా ఏకరువు పెట్టాడు రామ్మూర్తి గంటుపడిన ముఖంతో.

హెడ్‌కానిస్టేబుల్ వచ్చి రైటర్‌కు ఎదురుగావున్న పాత కుర్చీలో కూర్చున్నాడు. నలభై అయిదేళ్ళు వుంటాయి అతనికి. లావుగా, నల్లగా, కుమ్మ మొద్దులా వున్నాడు.

“సైకిల్ నంబరూ, కొన్న రశీదూ వున్నాయా?” ప్రశ్నించాడు హెడ్.

ఉన్నాయంటూ రశీదు తీసి చూపించాడు రామ్మూర్తి.

రశీదు చూసి, రైటర్‌కి యిచ్చాడు హెడ్.

“సైకిల్ పోయింది ఎన్ని గంటలకు?” అని ప్రశ్నించాడు.

"ఉదయం పదిన్నరకండి" సవినయంగా జవాబిచ్చాడు రామ్మూర్తి.

"ఇప్పుడు టైం ఎంతయింది?"

"వొంటిగంటండి."

"అంటే రెండున్నర గంటలయిందన్నమాట!" అన్నాడు హెడ్. "వెంటనే ఎందుకు కంప్లెయింట్ యివ్వలేదూ?"

"వెంటనే కంప్లెయింట్ ఇవ్వాలనే అనుకున్నాడండి మావాడు. కాని, రశీదు కోసం వెదకడంతో ఆలస్యమైందండి" అన్నాడు శంకర్రావు.

"మీ కసలు టైం సెన్సు బొత్తిగా లేదయ్యా!" అంటూ చిరాకుపడ్డాడు హెడ్.

"ఏం సార్?" అన్నారు మిత్రులు అయోమయంగా.

"కంప్లెయింట్ వెంటనే యిచ్చుంటే దొంగదొరికే అవకాశం వుండేది...ప్చ్! బాగా ఆలస్యం చేసేసారు. లాభంలేదు" అంటూ పెదవి విరిచేసాడు రైటరు.

"మరి నంబరూ రశీదూ లేకుండా..." నసిగాడు రామ్మూర్తి.

"అవెక్కడికి పోతాయండీ బాబూ! తరవాత తీసుకువచ్చేవారుగా?" అన్న రైటర్ పలుకులతో పొరపాటయిపోయిందనుకుంటూ ముఖాలు చూసుకున్నారు మిత్రులు.

"అయితే సైకిల్ ఇక దొరకదంటారా సార్?" బిక్కమొగంతో ప్రశ్నించాడు రామ్మూర్తి.

"ఎలా చెప్పగలం సార్?" మిమిక్రీ చేస్తున్నట్టుగా అన్నాడు రైటర్.

"వెంటనే అయితే ఆశ వుండేది. ఇంత ఆలస్యం జరిగాక చెప్పడం కష్టం. కేడీ నాగాళ్ళు యింత సేపూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటారనుకున్నారా? యీ పాటికి దాన్ని ఎక్కడో అమ్మేయడమో లేక ఏ పార్టుకాపార్టు పీకిపడెయ్యడమో చేసుంటారు" అన్నాడు ఓ కానిస్టేబుల్.

రైటర్ కేసు బుక్ చేసుకున్నాడు.

"ఎన్జీవో గాళ్ళం. కష్టపడి అమర్చుకున్న సైకిల్. ఏడాది దాటకుండానే పోయింది. దయచేసి మీరు ఎలాగైనా ఆ సైకిల్ కనిపెట్టాలి సార్!" అన్నాడు శంకర్రావ్.

"మేం మాత్రం ఏం చెయ్యమయ్యా? దేవుళ్ళం కాదుగా, వస్తువు ఎక్కడుందో దివ్యదృష్టితో తెలుసుకుని తక్షణమే మీకు తెచ్చివ్వడానికి?...మా ప్రయత్నం మేం చేస్తాం, వెళ్ళరండి" అన్నాడు హెడ్.

"సైకిల్ ఆచూకీ తెలిస్తే మీకు తెలియపరుస్తాంలెండి" అన్నాడు నిర్లక్ష్యంగా కుర్చీలో చేరబడి కాళ్ళు బార్లా చాపుతూ.

"అలా అంటే కాదు, మీరు గట్టిగా ప్రయత్నించాలి" అన్నాడు శంకర్రావు.

"మేం ఎప్పుడూ గట్టిగానే ప్రయత్నిస్తాం. కాకుంటే పోయిన వస్తువు దొరకడం, దొరకకపోవడం అన్నది పోగొట్టుకున్నవాళ్ళ అదృష్టం పైన

"ఆధారపడి వుంటుందంతే!" అన్నాడు రైటర్.

శంకర్రావు ఏదో అనబోతే హెడ్డు మళ్ళీ చిరాకుపడ్డాడు- "మీరు చదువుకున్నవాళ్ళు కూడాను-చెబితే అర్థం చేసుకోవాలి! ప్రయత్నిస్తాం అన్నాంగా, వెళ్ళరండి" అంటూ.

మిత్రులిద్దరూ వారికి నమస్కరించి బయటకు నడిచారు, తక్షణమే కంప్లెయింట్ యివ్వని తమ మూర్ఖత్వానికి చింతిస్తూ.

స్టేషన్ గేటు దగ్గరకు వెళ్ళేసరికి వారిని వెనకనుండి పిలిచాడు ఓ కానిస్టేబుల్.

ఆగారు వాళ్ళు.

"చదూకున్నోళ్ళు ఆమాత్రం గ్రహింలేకపోతే ఎలా సార్?" అన్నాడు కానిస్టేబుల్.

'ఎంత చదువుకున్నా పోలీసులముందు పూర్లేగా!' అనుకుంటూ "పోలీస్ స్టేషన్‌లో అడుగుపెట్టడం మా లైఫ్‌లో యిదే ప్రథమం. విషయం సూటిగా చెబితే తప్ప మాకు అర్థంకాదయ్యా బాబూ!" అన్నాడు శంకర్రావు.

నవ్వాడు కానిస్టేబుల్.

"ఏం లేదు...పోలీసు ఇన్ఫార్మెంట్సు కొందరుంటారు. వాళ్ళద్వారా ప్రయత్నించినట్టయితే మీ సైకిల్ ఆచూకీ తెలియవచ్చును" అన్నాడు.

"మరయితే అలాగే చేయొచ్చుగా?" అన్నాడు రామ్మూర్తి ఆత్రుతగా.

అతని అజ్ఞానానికా అన్నట్టు అదోలా నవ్వాడు కానిస్టేబుల్.

"ఇన్ఫార్మెంట్సుకి కొంత అర్పవకోంది మరి" అన్నాడు.

శంకర్రావుకి అర్థమైపోయింది.

"ఏ మాత్రం...అవుతుందేమిటి?" అంటూ ప్రశ్నించాడు—

"ఓ వందయినా అవుతుంది..."

"మా దగ్గర అంత వుండదు" అన్నాడు శంకర్రావు.

'అయితే మీ ఖర్మ' అనబోయి మానుకుని, "మీ ఇష్టం" అన్నాడు కానిస్టేబుల్.

"అలాగననకు. మాకు యిష్టంవున్నా యివ్వడానికి శక్తిలేనివాళ్ళం. ఎన్జీఓలమని చెప్పానుగా? పైగా ఇవాళ అప్పుడే పదో తేదీ కూడాను!" అన్నాడు శంకర్రావు

"నాకు తోచింది చెప్పాను. వంద రూపాయల కోసం ఆరువందల రూపాయల సైకిలు వదులుకుంటానంటే-నేను చెప్పేదేమీ లేదు" అన్నాడు కానిస్టేబుల్, వెనక్కి తిరుగుతూ.

రామ్మూర్తి, శంకర్రావు గుసగుసలు పోయారు. బియ్యం కొనడానికని జేబులో పెట్టుకుని తిరుగుతున్న యాభై రూపాయలూ తీసి మిత్రుడికిచ్చాడు రామ్మూర్తి.

"జవానుగారూ!" అంటూ కానిస్టేబుల్ వెనకే వెళ్ళాడు శంకర్రావు.

రామ్మూర్తి అతని వమసరించాడు.

"మా దగ్గర యాభై రూపాయలే వున్నాయి. ప్రస్తుతానికి యిది వుంచండి, సార్! సైకిల్ దొరికాక మీ మామూలు యిచ్చుకుంటాం" అన్నాడు.

కానిస్టేబుల్ ఓ క్షణం యోచించాడు.

"మీరు యింతగా ప్రాధేయపడుతున్నారు గనుక హెడ్‌గారితో మాటాడి ఈ డబ్బుతో సరిపెట్టమని చెబుతాను" అంటూ డబ్బు అందుకున్నాడు

తరువాత "నాకో పది పడెయ్యండి మరి...మీకు తెలియందేముంది! అప్పుడే పదో తేది వచ్చేసింది. యింట్లో కూరలేమీ లేవు" అంటూ పళ్లు యికిలించాడతను.

చేసేదిలేక తన జేబులోంచి ఓ పది రూపాయలు తీసి అతనిచేతిలో కుక్కాడు శంకర్రావు.

డబ్బు చేతిలో పడగానే "మీరేం వర్రీ అవకండి సార్! మీ సైకిల్ ఎలాగైనా పట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. వెళ్ళి రండి" అంటూ వారిని సాగనంపాడు కానిస్టేబుల్.

తరువాత, తన పదిరూపాయలూ ఖాకీపాంటుజేబులోకి తోసుకొని, యాభై రూపాయలూ తీసుకువెళ్ళి రైటర్ చేతిలో పెట్టాడు అతను.

• • •

రాత్రి ఎనిమిది గంటలకు-

సైకిల్ గురించి ఆచూకీ ఏదైనా తెలిసిందేమోనన్న ఆశతో, తెలుసుకుందామని పోలీస్ స్టేషన్‌కి వెళ్లారు రామ్మూర్తీ శంకర్రావులు.

స్టేషన్‌లోని లైట్లు అక్కడి స్టాఫ్‌లాగే డల్‌గా వున్న కారణంగా చీకట్లను పూర్తిగా పారద్రోలలేకపోతున్నాయి. మసక వెలుతురులో దిక్కుదిక్కుమంటూ వుంది స్టేషన్.

గుమ్మం దగ్గర సెంట్రీ లేడు.

లోపలికి నడిచారు మిత్రులు.

వరండాలో కూడా ఎవరూ కనిపించలేదు.

లోపలి నుండి మాత్రం ఎవరివో అరుపులూ, ఆర్తనాదాలూ ఆగి ఆగి వినిపిస్తున్నాయి.

వరండాలోనే ఆగిపోయి ముఖాలు చూసుకున్నారు మిత్రులు. లోపలికి వెళ్ళడానికి అడుగులు పడలేదు

"ఎవరి దేహానికో ఓవర్ హాలింగ్ జరుగుతున్నట్టుంది!" చిన్నగా అన్నాడు శంకర్రావు నవ్వుతూ

"పోనీ, తిరిగి వెళ్ళిపోదామేమిటి, రేపు రావచ్చును!" అన్నాడు రామ్మూర్తి బెరుకుగా.

"ఫరవాలేదు" అన్నాడు శంకర్రావు.

వరండాలో క్రీనీడగా వున్నచోట స్తంభం ప్రక్కన నిల్చున్నారు యిద్దరు, ఎవరైనా బయటకు వస్తారేమో పలకరించవచ్చునని ఎదురుచూస్తూ-

అంతలో—

లోపలి నుంచి మళ్ళీ దెబ్బలూ, బూతులూ- వాటి వెంటనే "బాబోయ్! బెల్టుతో కొట్టకండి సార్! చచ్చిపోతాను" అంటూ కెవ్వున అరుస్తూ, ఏడుస్తున్నారెవరో.

"దొంగ లం...కొడకా! నిజం చెప్పకపోతే బెల్టుతో కొట్టడంకాదు బయొనెట్‌తో పొడిచిపారేస్తాను..." అంటూ బండబూతులు తిడుతూన్న హెడ్ గొంతును గుర్తుపట్టారు మిత్రులు.

మరుక్షణంలో మళ్ళీ దెబ్బలూ, అరుపులూను...

లోపలి తతంగం ఎంత సేపటి నుంచి కొనసాగుతుందోగాని, తలచుకునేసరికి రామ్మూర్తికి అప్రయత్నంగా కాళ్ళు వొణకనారంభించాయి.

మిత్రుడి అవస్థ గ్రహించిన శంకర్రావు, అతని భుజంమీద చేయివేసి. "అలా తన్నకపోతే దొంగ వెధవలు నిజం చెప్పరుట!" అన్నాడు,

అంతలో లోపలినుంచి పెద్దగా ఆర్తనాదం వినిపించడంతో మిత్రులు యిద్దరు వులిక్కిపడ్డారు.

"బాబోయ్! నిజం చెప్పేస్తాను... నన్ను చంపొద్దు!" అది నేరస్థుడి గొంతు!

"అయితే చెప్పు.. పొద్దుట టీపీవో దగ్గర దొంగిలించిన హీరోసైకిల్ ఏం చేసావ్? ఇంకా దొంకావంటే నీ శవమే బయటకు వెళుతుంది యిక్కడి నుంచి" గర్జించాడు హెడ్. అతనిది బ్రాగినవాడి గొంతుకలా వుంది.

మరోసారి ఉలిక్కిపడ్డారు మిత్రులు.

'విచారణ జరుగుతున్నది తమ కేసులోనే!'

నేరస్థుణ్ణి చూడాలన్న కుతూహలంతో గుమ్మంవైపు నడవబోయాడు రామ్మూర్తి శంకర్రావు అతని చేయి పట్టుకుని ఆపేసాడు.

"ఈ సమయంలో మనం వెళ్ళకూడదు" అన్నాడు.

"మూడొందలకు అమ్మేశాను సార్!" నేరస్థుడి జవాబుతో పాటు బెల్టుతో దెబ్బ. వాడు కెవ్వుమనడమూ వినిపించాయి.

"దొంగనాయాళా? సైకిల్ ఎత్తుకొచ్చినట్టు మాతో చెప్పావట్రా? మా కళ్ళుగప్పి సైకిల్ అమ్ముకుని మా వాటా ఎగవేద్దామనుకున్నావట్రా బాడ్కోవ్!" అరుస్తున్నాడు హెడ్.

"లేదొర్! పొరపాటైపోయిందొర్, ఇంకెప్పుడూ మీతో చెప్పకుండా అమ్మను సార్!" ప్రాధేయపడుతున్నాడు నేరస్తుడు.

వరండాలో రామ్మూర్తి, శంకర్రావులు అయోమయంగా ఆ సంభాషణను ఆలకిస్తూ వుండిపోయారు.

"మీ జాతే అంతరా! పోనీలెమ్మని మిమ్మల్ని కాపాడుకుంటూ వస్తున్నందుకు, పోలీసోళ్ళకే ద్రోహం చేస్తావుట్రా?"

"తప్పయిపోయిందొర్...మీ సగం వాటా తీసేసుకోండొర్...నన్ను కొట్ట

కండ్వార్!"

"సగం వాటా ఎవడికోసం ఇస్తావ్‌రా నా కొడకా!" అంటూ మరో దెబ్బ వేశాడు హెడ్. "ఎక్కడ దాచావ్ డబ్బు?"

"నా డ్రాయర్ పాకెట్‌లోనే వుంది సార్."

"తియ్ బయటకు."

విషయం ఆకళింపు అయ్యేసరికి నిలిచున్న చోటనే కొయ్యబారిపోయారు మిత్రులు

"ఇదిగో సార్! ఈ మూటయావత్తై తమరుంచుకోండి సార్."

"ఛత్, నాయాల! ఎవడికి పెడ్దామనుకున్నావ్‌రా టోపీ! డబ్బంతా ఇలాగియ్!" హెడ్ డబ్బంతా లాక్కున్నట్టున్నాడు— "సార్! మొత్తం మూడొందలు సార్! మీ వాటా తీసుకుని మిగతాది నాకు యిచ్చెయ్యండి సార్!" అంటూ ప్రాధేయపడుతున్నాడు నేరస్థుడు.

"నోరెత్తితే తంతాను లం...కొడకా! ఒప్పందం ప్రకారం సైకిల్ దొంగిలించగానే మర్యాదగా మాతో చెప్పావట్రా? దావగొడితే కాని నిజం చెప్పావుకాదు. మమ్మల్ని మోసగించాలని చూశావు కాబట్టి నీవాటా కూడా మేమే తీసేసుకుంటున్నాం. అదే నీకు శిక్ష!" ఖండితంగా తీర్పు యిచ్చేశాడు హెడ్డు.

"సార్!...సార్!... కనికరించండి సార్! వారంనుంచి యింట్లో తిండి గింజలు లేవు సార్! నా వాటా యిచ్చేస్తే పెళ్ళాం పిల్లలకు నాలుగురోజులు కడుపు నిండుతుంది సార్!..."

"ఛస్. నోర్మూయ్యెహే'. సైకిల్ పోగొట్టుకున్నవాడు ఆలస్యంగానయినా మా దగ్గరకు వచ్చాడు కాబట్టి తెలిసింది. లేకుంటే సైకిలమ్మిన సొమ్మంతా మాకు తెలియకుండా మెక్కే తినేసేవాడివిగా? అలా ఎంత తింటున్నావో మాకేం తెలుసు?"

'అది రైటర్ గొంతుక!' అనుకున్నారు మిత్రులు.

"లేదార్..."

వాడి మాట పూర్తికాకుండానే ఫెడీమంటూ మరో దెబ్బ వినిపించింది.

కెవ్వుమన్నాడు వాడు.

"రాస్కెల్! ఎవడి దగ్గర్రా నీ జిత్తులు!" హెడ్ అరిచాడు.

"బుద్ధి గడ్డి తింది సార్! యింకెప్పుడూ అలా చేయను సార్!...పోనీ ఓ వందయినా యివ్వండి సార్! పిల్లలు ఆకలితో చూస్తుంటారు సార్..."

"నోరెత్తేవంటే చంపేస్తాను, వెధవా! ఒక్కపైసా కూడా ఇవ్వను, నీ దిక్కున్నచోట చెప్పుకో—మళ్ళీ మాట్లాడావంటే తెల్లవార్లూ లాకప్‌లో తొంగోవాలి జాగ్రత్త!"

హెడ్ అరుపులకు బెదిరాడో ఏమో "వొద్దు సార్!" అనడం మినహా మళ్ళీ నోరెత్తలేదు నేరస్థుడు.

రామ్మూర్తికి వొళ్లు వుడికిపోయింది.

కాయవలసిన కంచే చేనును మేపేస్తోంది పబ్లిక్‌గా!

ఏదో ఆవేశం కలగడంతో లోపలికి వెళ్ళబోయాడు రామ్మూర్తి.

చటుక్కున అతన్ని పట్టుకుని ఆపేసాడు శంకర్రావు.

"ప్రయోజనం లేదు బ్రదర్! అడిగితే అభాసుపాలవ్వాలంతే!" అన్నాడు మెల్లగా

"అలాగని చూస్తూ వూరుకోమంటావా?"

"తప్పదు! వాళ్ళు రక్షకభటుల్లా లేరు. భక్షకభటులయ్యారు!!" అన్నాడు శంకర్రావు.

"ముందు మనం ఇక్కడి నుంచి బయటపడాలి, పద."

"ఏమిట్రా నువ్వంటున్నది? నా కొత్త సైకిల్ వదిలేసుకోమంటావా" అయోమయంగా అడిగాడు రామ్మూర్తి.

"నీ సైకిల్‌కి ఎప్పుడో రెక్కలు వచ్చేసాయి! వాళ్ళ రహస్యం మనకు తెలిసిపోయినట్టు గ్రహించారంటే ఫాల్స్ కేసు బనాయించి మనిద్దరినీ జైలుకి పంపగల సమర్థులు వాళ్ళు!" అన్నాడు శంకర్రావు. "చోరీ జరిగిన వెంటనే కంప్లెయింట్ యివ్వలేదని ప్రొద్దుట హెడ్డు ఎందుకు అంతగా చిరాకుపడ్డాడో యిప్పుడు అర్థమవుతోంది! ఆలస్యమైతే తమ వాటా పోతుందని!!"

"పోలీసులంతా యింతేనంటావా?" ఆశ్చర్యంగా, బాధగా అడిగాడు రామ్మూర్తి.

అంతా ఒకేలా ఎందుకుంటారు? ప్రతి డిపార్టుమెంటులోనూ మంచివాళ్ళు చెడ్డవాళ్ళూ అని రెండు జాతులు వుంటాయి. కాకుంటే మన దురదృష్టంకొద్దీ యిప్పుడు మనకు తారసపడింది రెండవ జాతి! అంతే!!"

అప్రయత్నంగా మిత్రుల చూపులు స్టేషన్ గోడపైనవున్న చాటికాయంతటి ఇంగ్లీషు వాక్యంమీద పడ్డాయి.

'ప్లీజ్ హెల్ప్ అజ్ టు హెల్ప్ యూ!' కసిగా చదువుకున్నారు యిద్దరూ.

రామ్మూర్తి చటుక్కున నేలపైన కనిపించిన బొగ్గుముక్క తీసాడు.

ఆ వాక్యంలోని చివరిమాట 'యూ'ను కొట్టివేసి, దాని ప్రక్కనే 'అవర్ సెల్వ్స్' అని రాసాడు బొగ్గుతో.

ఇప్పుడు ఆ వాక్యం- 'ప్లీజ్ హెల్ప్ అజ్ టు హెల్ప్ అవర్ సెల్వ్స్!' అయింది.

తన అసహాయతను, వుక్రోషాన్ని ఆ విధంగా తీర్చుకున్న రామ్మూర్తిని చేయిపట్టుకుని బరబరా బయటకు లాక్కుపోయాడు శంకర్రావ్. •